క్లుప్తంగా

పాఠశాలలు ప్రారంభం



ఏపీత్రయం మెయిన్ ప్రాథమిక పాఠశాలకు హాజరైన విద్యార్థులు

పెదపూడి: వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా తరలి వచ్చారు. మండలంలోని 14 ఉన్నత పాఠశాలలు, 48 ప్రాథమిక పాఠశాలలను తెరిచారు. ప్రభుత్వం పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు విద్యాకానుక పంపిణీ చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. మరోపక్క నాడు–నేడు పథకంలో అభివృద్ధి పనుల కారణంగా పాఠశాలలు అందంగా ముస్తాబవ్వడంతో విద్యార్థులు సంతోషం వెలిబుచ్చారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్



తిరుమలాయపాలెంలో పోలీసు పికెట్

గోకవరం: తిరుమలాయపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గ్రామంలో అనుమతులు లేకుండా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం, తద్వారా పోలీసులు ఆ విగ్రహాన్ని తొలగించడంతో ఉద్రిక్తిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామంలో 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు గ్రామంలోకి వచ్చే వాహనాలు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఈనెల 14 వరకు 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో పికెట్ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

పీఏసీఎస్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధం



పైన సొసైటీలో సిద్ధం చేసిన ఖరీఫ్ సీజన్ విత్తనాలు

పెదపూడి: పైన గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసినట్టు సొసైటీ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సహకారంతో తమ సొసైటీలో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, సీజన్ ప్రారంభంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే వీటిని సిద్ధంగా ఉంచామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇద్దరు విలేకరుల అరెస్ట్



ఇలపల్లిలో విచారణ చేస్తున్న ఈస్ట్‌జోన్ డీఎస్పీ డాక్టర్ కిషోర్ కుమార్

బిక్కవోలు: మండలంలోని ఇలపల్లి గ్రామంలోని శనివారం రాత్రి రైతులను బెదిరించిన విలేకరులపై ఆదివారం కేసు నమోదు చేయడంతో పాటు ఇద్దరు విలేకరులను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ చేపట్టిన డీఎస్పీ డాక్టర్ ఎం.కిషోర్‌కుమార్ సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. ఈ ఘటనలో జి.మామిడాడ చెందిన మేడపాటి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డిలను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. డీఎస్పీ వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పి.బుజ్జిబాబు తదితరులున్నారు.

స్పందనకు రెండు అర్జీలు

సీతానగరం: స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సందన కార్యక్రమానికి రెండు అర్జీలు వచ్చాయని ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. సీతానగరం సంత మార్కెట్ వద్ద గల గుడిని పునఃనిర్మాణం చేస్తున్నామని, అక్కడ స్థలం ఆక్రమణకు గురైందని పలువురు అర్జీ ఇచ్చారన్నారు. చినకొండేపూడిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్య ఉందని మరో అర్జీ అందజేయాలన్నారు.

ఎస్ఈబీ దాడి

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో సోమవారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 35 లీటర్ల సారా పట్టుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. గొద్దు వీర వెంకట మల్లేశ్వరరావు, మరొ నూక రాజును అరెస్టు చేశారు.



విద్యార్థులకు జేవీకే కిట్లను అందజేస్తున్న దృశ్యం



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో జేవీకే కిట్ల పంపిణీ



గోకవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొలిరోజే విద్యార్థులకు కానుక

- జేవీకే కిట్ల పంపిణీ
- సందడిగా కార్యక్రమం

రాజానగరం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందజేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయా పాఠశాలల వద్ద సందడి నెలకొంది. దివాన్ చెరువు క్లస్టర్‌లోని పాఠశాలల విద్యార్థులకు జరిగిన పంపిణీ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు పాల్గొన్నారు. ఎంఈఓ రామన్నదొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, షూ ఇలా జగనన్న కిట్ల ద్వారా మొదటి రోజునే అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పథకాలు

సీతానగరం: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని ఎంఈవో కె.స్వామి నాయక్ అన్నారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ మండలంలో 5,004 మందికి జేవీకే కిట్లు అందిస్తున్నామన్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్ బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘ అధ్యక్షుడు కోంద్రపు ముత్యాలు, ఎంపీటీసీ వెన్నెల అప్పల నాయుడు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, హెచ్ఎం పుష్పలత, ఉపాధ్యాయులు కన్నూరి సతీష్‌బాబు సీఆర్పీలు రమణ, చంటిబాబు, బేగం, ప్రసాద్ పాల్గొన్నారు.



దోసకాయలపల్లిలో కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు

విద్యారంగంలో వినూత్న విప్లవం

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విద్యారంగంలో వినూత్న విప్లవం తీసుకొచ్చారని జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి హైస్కూల్లో సోమవారం మండల స్థాయిలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మండలంలోని 55 పాఠశాలలకు చెందిన 7,300 మంది విద్యార్థులకు ఈ కిట్లు అందజేశామన్నారు. మరో అతిథి ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. ఎంఈఓ టి.కుశలవదొర అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో కన్వీనర్ గణేశుల పోసి, మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తోందని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకోవడంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గోకవరంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, నాయకులు సుంకర వీరబాబు, తోలేటి రాంప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు కిట్లు అందజేశారు. అంతకు ముందు ఉదయం రాగి జావ అందించారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కణితి శ్రీనివాస్, హెచ్ఎం పి.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఉప సర్పంచ్ డి.ధర్మరాజు, దంగేటి వెంకటరత్నం, పీఎంసీ చైర్మన్ గుప్తలు పాల్గొని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు.

ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా శంకుస్థాపనలు

సీతానగరం: నియోజకవర్గంలో ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని పలు ఆలయాల పునర్నిర్మాణారికి సోమవారం శంకుస్థాపనలు చేశారు. ముందుగా సీతానగరంలో సీతారామాలయం, అక్కడి నుంచి కాటవరంలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు.

117 ఆలయాల నిర్మాణం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో 117 ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీతానగరంలో సీతారామాలయానికి సుమారు రూ.60 లక్షలు ఖర్చవుతుందని, అందులో రూ.40 లక్షలను దేవదాయ, ధర్మదాయశాఖ సీజీఎఫ్ ద్వారా కేటాయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. మిగిలిన రూ.20 లక్షలు ఆలయ కమిటీ భరిస్తుందన్నారు. కాటవరంలో రామలింగేశ్వరస్వామి ఆలయానికి రూ.75 లక్షలు వ్యయం అవుతుందని, దేవదాయ, ధర్మదాయశాఖ సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షలు, గ్రామస్తుల విరాళం రూ.20 లక్షలు, ఆలయ కమిటీ ప్రోత్సాహకారంగా రూ.5 లక్షలు వైఎస్సార్ సీపీ మండల కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కోంద్రపు ముత్యాలు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, పార్టీ నాయకులు వలవల వెంకట్రాజు, చల్లమళ్ల సుజీరాజు, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, చిర్రవూరి మధుసూదన రావు, మట్ట వసంతరావు పాల్గొన్నారు.



సీతానగరంలో సీతారామాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

శ్రీకృష్ణపట్నంలో..

రాజానగరం: శ్రీకృష్ణపట్నంలో గ్రామ దేవత సత్తెమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోమవారం భూమిపూజ చేశారు. సుమారు రూ. 25 లక్షలతో నిర్మాణం జరగనున్న ఈ ఆలయానికి టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

అనపర్తి: స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణం వద్ద ఐటీసీ లిమిటెడ్ సహకారంతో నిర్మించే పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో వర్తకులు, దుకాణాల్లో పనిచేసే సిబ్బంది, వివిధ అవసరాల నిమిత్తం పరిసర గ్రామాల నుంచి అనపర్తి వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనపర్తి ఐటీసీ ఆధ్వర్యంలో రూ.25 లక్షల వ్యయంతో మరుగుదొడ్ల సముదాయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఐటీసీ ఫ్యాక్టరీ మేనేజర్ ఎంఎస్ సుధీర్, పర్సనల్ మేనేజర్ అబ్దుల్ వాహీద్ తదితరులు పాల్గొన్నారు.



పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

వైఎస్సార్ సీపీ పాలనలో పేదల అభ్యున్నతి



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పశ్చిమగానుగూడెంలో గడపగడపకూ

మధురపూడి: వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్రంలోని పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి జరుగుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెం గ్రామంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ పశ్చిమగానుగూడెం అభివృద్ధికి రూ.2.7 కోట్లు కేటాయించామన్నారు. దానిలో రూ.67.20 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేశామన్నారు. నాడు – నేడు పథకంలో రూ.41.05 లక్షలు, గ్రామ సచివాలయానికి రూ.25 లక్షలు ఖర్చుచేసినట్టు తెలిపారు. పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కాగా.. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రజలు కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 10 గంటల వరకూ సుమారు 200 గడపలు తిరిగారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ గణేశుల పోసి, నాయకులు కల్యాణం రాంబాబు, తోరాట శ్రీను, బొరుసు బద్రి, మేడిశెట్టి రామచంద్రరావు, బత్తిన చిన్ని, టి.గంగరాజు పాల్గొన్నారు.

నూజిళ్ల సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ(డైట్) ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా నూజిళ్ల రామసుబ్రహ్మణ్యం అందించిన సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఆయన డైట్ దూబచర్లకి బదిలీ అయిన సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఆయనకు దుశ్శాలువాను కప్పి, నూతన వస్త్రాలు, జ్ఞాపికతో అందజేశారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో డైట్ ప్రిన్సిపాల్ ఎఫ్ఏసీగా విజయవంతంగా పనిచేశానని, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



రామసుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న డైట్ ప్రిన్సిపల్ రమణ తదితరులు

అన్నదాతల చూపు.. సేంద్రియ ఎరువుల వైపు..

- పొలాల్లో వేస్తున్న చెరువులు, కుంటల్లోని మట్టి
- భూసారం పెంచడంపై దృష్టి సారించిన రైతులు

పెదపూడి: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సేంద్రియ ఎరువుల వినియోగం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. దీన్ని వ్యవసాయశాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. రసాయన ఎరువులు వాడకంతో వచ్చే అనర్థాలను గుర్తించిన పలువురు రైతులు భూసారం పెంపుపై దృష్టి సారించారు. పశువుల పేడ, కోడిపెంట, చీకిన గడ్డితో పాటు చెరువులు, కుంటల్లోని పూడిక మట్టిని పొలాల్లో వేస్తున్నారు. ఏళ్ల తరబడి రసాయన ఎరువుల వాడకంతోనే భూసారం తగ్గిపోయి పంటలకు చీడపీడలు అధికంగా సోకుతున్నాయన్న అంచనాకు వచ్చిన అన్నదాతలంతా సేంద్రియ ఎరువులు వేసేందుకే ఆసక్తి చూపిస్తున్నారు.

40 శాతం మంది రైతుల మొగ్గు

అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట, రాజానగరం, కోరుకొండ, సీతానగరం మొత్తం ఏడు మండలాల్లో కలిపి ఈ ఖరీఫ్ సీజన్‌లో 63 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. గత అనుభవాల దృష్ట్యా సుమారు 40 శాతం మంది రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలనిచ్చే సేంద్రియ ఎరువులనే వాడాలని భావిస్తున్నారు. పశుసంపద లేని రైతులు కోళ్లఫారాలలోని కోళ్లపెంట, చెరువులు, కుంటల్లో పూడిక మట్టిని కొనుగోలు చేసి మరి పొలాలకు తరలిస్తున్నారు. పొలాల్లో పంట దమ్ములకు ముందే సేంద్రియ ఎరువులను వేసి కలియ దున్నితే త్వరగా మట్టిలో కలిసిపోయి, మంచి ఫలితాలను ఇస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు.



కైకవోలులో పంట పొలంలో చల్లడానికి సిద్ధం చేసుకున్న పెంటకుప్పలు

తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు

సేంద్రియ ఎరువులు వాడితే పంటకు కావలసిన అన్ని ముఖ్యమైన పోషకాలను అందించొచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోకుండా దోహదపడతాయి. ప్రధానంగా నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నప్పుడు సేంద్రియ ఎరువులు భూమి పొరల్లో ఉండే నీటిని మొక్కలకు లభ్యమయ్యేలా చేస్తాయి. ఇసుక నేలల్లో మెత్తని మట్టి శాతాన్ని పెంచడానికి, నీటిని పట్టి ఉంచే శక్తి పెంపొందించడానికి సేంద్రియ ఎరువులు దోహదపడతాయి. ఫలితంగా మొక్కలు పరిస్థితులు తట్టుకుని పెరగడానికి వీలు పడుతుంది. నేలలో మొక్కలకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మజీవులు అభివృద్ధి చెందడానికి సేంద్రియ ఎరువులు ఆహారంగా ఉపయోగపడతాయి. అంతేకాదు సేంద్రియ ఎరువులు వాడిన పొలాల్లో చీడపీడలు, తెగుళ్లు తక్కువగా ఉండడంతో పాటు నాణ్యమైన దిగుబడి వస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే సేంద్రియ ఎరువుల వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందొచ్చు.

సేంద్రియ ఎరువులతో ఎంతో మేలు



పొలాల్లో సేంద్రియ ఎరువులు వాడటంతో పంటకు ఎంతో మేలు జరుగుతుంది. రైతుకు తక్కువ ఖర్చుతో ఎన్నో లాభాలుంటాయి. సేంద్రియ ఎరువులు వాడిన భూముల్లో నాణ్యమైన పంటలు పండుతాయి. పైగా చీడపీడలు తగ్గుతాయి.

– టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయ శాఖ అధికారి, పెదపూడి

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు చేరవేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని శ్రీకృష్ణపట్నంలో వలంటీర్లను సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలో 22 మంది వలంటీర్లు ఉండగా వారిలో ఒకరికి సేవా రత్న, 21 మందికి సేవా మిత్ర అవార్డులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, ఎంపీటీసీ సభ్యుడు బత్తిన కరుణాకర్, నాయకులు కమ్మిడి సోమరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

సీతానగరం: ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత సేవాదళ్‌పై ఉందని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్ బాబు) అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మాళెం సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జులకు సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పలు సూచనలు అందించారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజల్లోకి ప్రభుత్వ పనితీరును తీసుకువెళ్లాలని సూచించారన్నారు.

తొలిరోజు 49 శాతం విద్యార్థుల హాజరు

బిక్కవోలు: మండలంలో వేసవి సెలవుల అనంతరం తొలి రోజు పాఠశాలలకు 49 శాతం విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ కె.శ్రీనివాసరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 30 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలల్లో 4,266 మంది విద్యార్థులకు గాను 2,108 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఒంటి పూట పాఠశాల నిర్వహిస్తున్నామన్నారు.

46 మంది టీచర్ల బదిలీ

రంగంపేట: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా మండలంలో వివిధ ఎంపీపీ, ఎంపీయూపీ పాఠశాలల్లో పని చేస్తున్న 46 మంది ఉపాధ్యాయులు వేరే మండలాలకు బదిలీ అయినట్లు మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే ఇతర మండలాల నుంచి రంగంపేట మండలంలోని వివిధ పాఠశాలల్లో ఇప్పటివరకూ 17 మంది ఉపాధ్యాయులు జాయిన్ అయ్యారన్నారు. మంగళవారం నుంచి జగనన్న విద్యాకానుక కిట్లు ఆయా పాఠశాలల్లో ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేస్తారని చెప్పారు.

బ్రాందీషాపు తరలించాలి

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంకు చెందిన పలువురు బ్రాందీషాపు తరలించాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజుకు సోమవారం వినతిపత్రం అందించారు. కొప్పాక రాజారావు, పసలపూడి రామారావు, పంతుల శ్రీను, పంతుల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రఘుదేవపురం శ్మశానవాటిక రోడ్డులో బ్రాందీషాపు పెట్టారని, దానిని ఆనుకుని అదే రోడ్డులో బెల్ట్‌షాపు ఉందన్నారు. కొందరు మద్యం తాగి శ్మశానవాటిక వద్ద సీసాలు బద్దలు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రోడ్డుకు అడ్డుగా మోటారు సైకిళ్లు పెట్టి గొడవలకు దిగుతున్నారన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కంబాలచెరువు: మూఢాచారాల నుంచి శాస్త్రీయత వైపు ప్రజలను నడిపించేందుకు జన విజ్ఞాన వేదిక పనిచేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో సోమవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎస్.రవిబాబు మాట్లాడుతూ ఆధునిక యుగంలో కూడా కొందరు విజ్ఞానాన్ని వదిలి అజ్ఞానం వైపు పయనిస్తున్నారన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ కన్వీనర్ సీహెచ్ నిశ్చల్, మణికంఠ, గోపికృష్ణ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ప్రకాశం నగర్: ఐఫోకస్ మిషన్ సభ్యులు వెటర్నరీ డాక్టర్ శ్రీ కిరణ్ యర్రంశెట్టి రచించిన 'నాన్నకేం తెలుసు' పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం స్థానిక తిలక్ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ నివాసంలో జరిగింది. వాసు తొలి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాన్న చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.